క్లుప్తంగా

మంచినీటి బోరుకు శంకుస్థాపన

నల్లజర్ల: ప్రజల తాగునీటి అవసరాల కోసం నల్లజర్లలోని కోనేరు కాలనీలో బోరు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.ఐదు లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఈ బోరునకు శనివారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి శంకు స్థాపన చేశారు.కొత్త బోరు పూర్తయి, అందుబాటులోకి వచ్చేవరకూ కాలనీ వాసులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా తాగునీరు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, తహసీల్దారు కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



హోం మంత్రి వనిత చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్

తాళ్లపూడి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీని, క్యాలెండర్‌ను హోం మంత్రి తానేటి వనిత ఆవిష్కరించారు. వైఎస్సార్ టీఎఫ్ నాయకులు శనివారం మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కవల వెంకటరావు , ప్రధాన కార్యదర్శి గొంతి సతీష్, మహిళా కార్యదర్శులు జేడీ సునీత, సూర్యకుమారి పాల్గొన్నారు.

పింఛను తీసుకుని వెళుతూ వృద్ధుడి మృతి

చాగల్లు: వృద్ధాప్యపు పింఛను తీసుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా అస్వస్థతకు గురై వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చాగల్లులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చాగల్లుకు చెందిన ఇమ్మణి వీర్రాజు (73) వృద్ధాప్య పింఛను తీసుకుని ఇంటికి వెళుతుండగా అస్వస్థతకు గురై రోడ్డుపై కుప్పకూలాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న హోం మంత్రి తానేటి వనిత వెంటనే చలించి తన క్యాన్వాయ్‌ను ఆపి వృద్ధుడిని కారులో ఎక్కించుకుని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ వృద్ధుడి మృతి చెందాడు.

40 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

గోపాలపురం: కరగపాడు గ్రామ శివార్లలో నిర్వహిస్తున్న సారా బట్టీపై శనివారం గోపాలపురం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో గుర్తించిన 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం, గ్యాస్ స్టౌ, గ్యాస్ బండ, పాత్రలను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వివరించారు.

96 మందికి ఆయుర్వేద వైద్య సేవలు

నిడదవోలు: స్థానిక రోటరీ ఆడిటోరియంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. రొటేరియన్ ఉప్పులూరి వీరభద్రరావు ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు, డాక్టర్ కె. శ్రీవిద్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పొలదాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9న వర్సిటీ స్థాయి కిక్ బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు

నిడదవోలు: నన్నయ విశ్వ విద్యాలయం పరిధిలో ఈ నెల 9న పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పురుషులు, మహిళల విభాగాల్లో కిక్ బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నయ విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలకు చెందిన 17 నుంచి 25 ఏళ్ల వయసున్న విద్యార్థినీవిద్యార్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో నిర్వహించే అంతర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటాయని ప్రిన్సిపాల్ జ్యోతి వివరించారు.

పట్టణంలో మెప్మా మార్కెట్

నిడదవోలు: పట్టణంలోని శనివారం మార్కెట్‌లో మెప్మా మార్కెట్ ఏర్పాటు చేశారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు తీసుకున్న 18 మంది మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, దుస్తులు, నిత్యావసరాలు, తినుబండారాలను ఈ మార్కెట్‌లో విక్రయించారు. మెప్మా సిటీ మేనేజర్ డి.శివప్రసాద్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తమ కాళ్లపై నిలబడి కుటుంబ పోషణకు యూనిట్లు పెట్టుకుని నడుపుకుంటే వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఎల్ ఎ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్ వెంకటలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో పింఛన్ల పండగ
- లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన, రూ.3 వేలకు పెరిగిన పెన్షన్ల పంపిణీ



చాగల్లు సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

చాగల్లు: ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్రహోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లులోని గంద్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలో శనివారం మండల స్థాయిలో నూతన పెన్షన్లు, పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హోం మంత్రి వనిత మండలంలో కొత్తగా పింఛన్లు మంజూరైన 126 మంది లబ్ధిదారులకు రూ.3.78 లక్షల నగదును అందజేశారు. రూ. మూడు వేలకు పెంచిన పింఛను సొమ్మును కూడా ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 9,733 మందికి రూ.2.85 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ల రూపంలో అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఎవరికైనా కొత్త పెన్షన్ మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీలు సిఫార్సు చేయాలి, లేదా ఉన్న పింఛన్‌దారుల్లో ఎవరైనా చనిపోవాలని గుర్తు చేశారు. సీఎం జగనన్న ప్రతి ఇంటి బిడ్డగా ఆలోచించి ఎవరికి, ఏ అవసరం ఉన్నా సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా తోడుగా ఉంటున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసిన వాటిని పక్కన పెట్టి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని మంత్రి వనిత కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి శివ, సుంకర రాయుడు, పంచాయతీ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ పెద్దగా పథకాల అమలు

తాళ్లపూడి: గతంలో ఏ ముఖ్యమంత్రీ చేపట్టనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, పేదలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓ కుటుంబ పెద్దలా ఆదుకుంటున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బల్లిపాడులోని డీవీవీ దానయ్య ఎస్టేట్‌లో శనివారం మండల స్థాయి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకకు హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు, రూ.3 వేలకు పెంచిన పింఛను సొమ్మును మంత్రి వనిత చేతుల మీదుగా పేదలకు పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 189 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. ఈ నెల నుంచి రూ.3 వేలకు పెరిగిన పింఛను సొమ్మును 7,871 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.1,000 ఉన్న పెన్షన్ మొత్తాన్ని జగన్ ప్రభుత్వంలో ప్రస్తుతం రూ.3,000కి పెంచి ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం (2014 –19)లో పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సగటున నెలకు ఖర్చు చేసింది కేవలం రూ.400 కోట్లు మాత్రమేనని, జగనన్న ప్రభుత్వంలో నెలకు రూ.1963 కోట్ల చొప్పున అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు తోట రామకృష్ణ, గూడా విజయరాజు, పిట్టా శ్రీనివాస్, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, నక్కా చిట్టిబాబు, వల్లభశెట్టి శ్రీనివాస్, కొలిశెట్టి నాగేశ్వరరావు, సర్పంచులు నామా శ్రీనివాస్, ఎల్లిన శివ, ఎలిపే సుధారాణి, యాళ్ల స్వప్న, తిగిరపల్లి వెంకటరావు, గండి రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలతో పాలన వేగవంతం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- జగన్నాథపురంలో సచివాలయ భవనం ప్రారంభం



జగన్నాథపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: గ్రామ స్థాయిలో సచివాలయాలను నెలకొల్పడంతో పాలన వేగవంతమైందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చెల్లారి రామ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాలనా వికేంద్రీకరణతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలన తీసుకు వస్తామని చాలా ప్రభుత్వాలు మాటలు చెప్పాయే గాని, అమలు చేయలేక పోయాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే సచివాలయ వ్యవస్థ వచ్చిందన్నారు. భవిష్యత్తు తరాలు బాగుపడాలన్నా, పేదల కష్టాలు తీర్చాలన్నా అది ఒక్క వైఎస్సార్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.

వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ..

అంతకు ముందు జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కాకర్ల రాజారావు, వామిశెట్టి పావనీకుమారి, వైఎస్సార్ సీపీ మండల, గ్రామ శాఖల అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్, బుంగ సుబ్బారావు, మారెళ్ళమూడి, పుల్లలపాడు సర్పంచులు ప్రగడ సుబ్రమణ్యేశ్వరి, డాక్టర్ అల్లూరి సూర్యచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం,మద్దిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నిచోట్లా అభివృద్ధి పనులు ముమ్మరం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- వడ్లూరులో ఆర్ అండ్ బీ రోడ్డుకు శంకుస్థాపన



వడ్లూరులో ఆర్ అండ్ బీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అన్ని ప్రాంతాల్లోనూ పనులను మరింత ముమ్మరం చేశామని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని వడ్లూరు గ్రామంలో ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు కూడా మొదలయ్యాయి. ఈ రోడ్డు దుస్థితి గురించి వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కొద్ది రోజుల క్రితమే ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధుల విడుదల చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఈ రహదారిని రూ.1.20 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఈ సింగిల్ రోడ్డును ఇప్పుడు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వడ్లూరు గ్రామంలో సంక్షేమ పథకాలు, డీబీటీ ద్వారా సుమారు రూ.30 కోట్లను లబ్ధిదారులకు అందించిందన్నారు. నాడు–నేడులో పాఠశాల అభివృద్ధి, గ్రామ సచివాలయం, రోడ్లు, జల్‌జీవన్ మిషన్, ఇతర అభివృద్ధి పనులకు రూ.3.89 కోట్లు కేటాయించినట్టు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్దార్థరాజు, సర్పంచ్ రఘమండ తేజశ్రీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు వేండ్ర రమేష్, బయ్యే సత్తిపండు, తానేంకి సత్యనారాయణ, వేగిశ్న నాగరాజు, రఘమండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన, టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కార్యకర్తలు

ఉండ్రాజవరం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో వడ్లూరు గ్రామానికి చెందిన జనసేన, తెలుగుదేశం పార్టీలకు చెందిన మన్నెపూడి శివ, మీసాల కొండలరావు, ఓలుపిల్లి సత్యనారాయణ, దూడి వెంకన్న శనివారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు ఐక్యంగా పని చేసి, వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకు రావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు కఠారి సిదార్థరాజు, సర్పంచ్ రఘమండ తేజశ్రీ శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యుడు వేండ్ర రమేష్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



వైఎస్సార్ యూత్ క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో గోపాలపురంలో నిర్వహించే వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న జట్టుకు రూ.50 వేలు, ద్వితీయ బహుమతి గెలుచుకున్న జట్టుకు రూ.25 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు రూ.5 వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.3 వేలు బహుమతిగా అందిస్తామని యూత్ సభ్యులు ప్రకటించారు.కార్యక్రమంలో నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, పడమట సత్యనారాయణ, శాఫ్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, వింత ప్రసాద్‌రెడ్డి వైఎస్ ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా 'కడలి'

పెరవలి: స్థానిక నంబర్–1 పాఠశాలలో శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం, మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా కడలి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నల్లాకుల దుర్గారావు, కోశాధికారిగా పీవీ వెంకట్రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా దొడ్డా శ్రీకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా దాసరి వరప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గోపాలపురం: మండలంలోని వివిధ ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో శనివారం అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులకు పలు సలహాలు అందజేశారు.